నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. బేగంపేట మయూరిమార్గ్, అల్లంతోట బావి, గీతాంజలి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి సిల్క్ శారీస్ ఏరియా, చీకోటి గార్డెన్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు

బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బీసీ నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బీసీ నాయకుడుని నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల లింగంగౌడ్ గురువారం డిమాండ్ చేశారు. కుటుంబ పార్టీగా పేరుగాంచిన టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ ఆవిర్భవించిన నాటి నుంచి ఒక్క బీసీ నేతను కూడా అధ్యక్ష పదవీ లేదా ఇతర ఉన్నత పదవుల్లో నియమించలేదని అన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నేతను నియమించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

బీసీల మహాసభకు ఓయూ జేఏసీ మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇందిరా పార్కు వద్ద ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన జరిగే బీసీల మహాసభకు ఓయూ జేఏసీ, బీఆర్ఎస్ నేతలు మద్దతు ప్రకటించారు. ఓయూ జేఏసీ చైర్మన్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వీరబాబు, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జంగయ్య మాట్లాడారు. పెద్ద సంఖ్యలో ఆర్ట్స్ కాలేజీ నుంచి సభకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: సౌత్ లాలాగూడలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి వార్షిక క్రీడోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26, 27 తేదీల్లో లాలాపేటలోని జయశంకర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చర్చి కమిటీ నాయకులు హాజరై బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఈ విధంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. సంఘ సభ్యులంతా ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గం ఉపాధ్యక్షుడు బి. ప్రవీణ్, సెక్రటరీ బి. వరకుమార్, జాయింట్ సెక్రటరీ శామ్‌సన్, ట్రెజరర్ గౌతమ్‌కుమార్, సంఘ నాయకులు కంతి జయకర్, బిషప్ మోజెస్, శాంసన్ తదితరులున్నారు.

నేడు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

కాచిగూడ: మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఈనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే జయంతి వేడుకల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహాలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి మండల, నియోజకవర్గ కేంద్రాలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేడు బీసీ విద్యార్థుల జిల్లా కలెక్టరేట్ల ముట్టడి

కాచిగూడ: విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఈనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యంతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇంజినీరింగ్, పీజీ , డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ, విద్యార్థుల పూర్తి ఫీజులు మంజూరు చేయలన్నారు. కాలేజీ విద్యార్థులకు సంవత్సరంకు రూ.20వేల స్కాలర్‌షిప్ ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1800 నుంచి రూ.15 వేలకు పెంచాలన్నారు. బీసీ కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ రోప్ సక్సెస్

మోండా మార్కెట్‌లో ఫుట్‌పాత్‌ల తొలగింపుతో విశాలంగా మారిన రోడ్లు

- ప్రస్తుతం ఈ రోడ్లపై సాఫీగా సాగుతున్న రాకపోకలు
- మహంకాళి పోలీసు స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీకి చెక్



విశాలంగా మోండా మార్కెట్ రోడ్డు

బన్సీలాల్‌పేట్: హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్ రోప్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. సికింద్రాబాద్ సుప్రసిద్ధమైన మోండా మార్కెట్ పరిసర రోడ్ల ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం పట్ల వాహనదారులు, పాదచారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కారణంగా అప్పటి వరకు ఇరుకుగా రోడ్లు విశాలంగా మారాయి. దీంతో వందలాది మంది వాహనదారులు, పాదచారులు సులువుగా ఈ రోడ్ల గుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఆపరేషన్ రోప్ కారణంగా ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్న సికింద్రాబాద్ ట్రాఫిక్ పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఎన్ని రకాల ఒత్తిళ్లు, బెదిరింపులు, నాయకుల నుంచి ఫోన్లు వచ్చినా ప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందనేది వాస్తవం.

◆ ఫుట్‌పాత్‌ల తొలగింపు కారణంగా చిన్నా చితక వ్యాపారులు కొంత వరకు ఇబ్బంది పడుతున్నా మొత్తానికి మెజారిటీ ప్రజలు, వాహనదారులు స్వాగతిస్తున్నారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే నేతృత్వంలో సికింద్రాబాద్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, మహంకాళి ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఎస్సై మహేష్‌లు ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నారు.

◆ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని అనేక ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు చురుకుగా సాగుతున్నది. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ఫుట్‌పాత్ ఆక్రమణ తొలగింపును చురుకుగా నిర్వహిస్తున్నారు.

◆ ఫుట్‌పాత్‌ల తొలగింపుతో పాటు దుకాణాల ముందు రోడ్డుపైకి వచ్చే విధంగా ఏర్పాటు చేసిన షెడ్డులను కూడా ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. దీంతో అనేక రోడ్లు చాలా దూరం వరకు విశాలంగా కనిపిస్తున్నాయి. గతంలో రోడ్డుపైకి వచ్చి పండ్లు అమ్ముకునే గంపల వ్యాపారులు పోలీసులు హెచ్చరికతో వెనక్కి జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు కొనసాగించడం గమనార్హం.

ఈ రోడ్లలో ట్రాఫిక్ టెన్షన్ ఖతం

◆ సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లు విశాలంగా దర్శనమిస్తున్నాయి. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుతో ఈ రోడ్ల గుండా వాహనదారులు, పాదచారులు సులువుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఓల్డ్ జైల్ నుంచి షోలాపూర్ స్వీట్ హౌస్, మోండా మార్కెట్ రోడ్డు, మారుతీ వీధి రోడ్డు, పాత గాంధీ ఆస్పత్రి చౌరస్తా నుంచి ఆల్ఫాహోటల్ వరకు రోడ్డు ఫుట్‌పాత్ తొలగింపుతో విశాలంగా మారాయి. పాలికాబజార్ చౌరస్తా నుంచి 31 బస్టాప్ వరకు ఇరువైపులా ఉన్న దుకాణాల ఆక్రమణలను తొలగించారు. గతంలో ట్రాఫిక్‌తో సతమతమైన ఈ రోడ్డు ప్రస్తుతంగా ఎంతో సులువుగా రాకపోకలు సాగుతున్నాయి. పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలోని విజయా ఆస్పత్రి రోడ్డులో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపుతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సదరు రోడ్లు విశాలంగా మారాయి.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగానే..: ఏసీపీ శంకర్‌రావు

◆ ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సికింద్రాబాద్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు చెప్పారు. నగర వ్యాప్తంగా ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను అక్రమించుకొని వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ఇటు ట్రాఫిక్‌కు ఇబ్బందితో పాటు వాహనదారులు అనేక అవస్థలు పడతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంతో ఏ ఒక్కరిని రోడ్డు పాలు చేయాలనే ఉద్దేశం తమది కాదన్నారు. ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఆపరేషన్ రోప్ కార్యక్రమం వల్ల గతంలో కంటే ప్రస్తుతం రోడ్లు విశాలంగా మారాయన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ వాహనదారులు, ప్రజలు తమను అభినందిస్తున్నారని పేర్కొన్నారు.

ఓయూ క్యాంపస్ సుందరీకరణ



ఓయూ ఆర్ట్స్ కాలేజీ బ్యాంక్ ఎదుట కొత్తగా నిర్మించిన గార్డెన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గతంలో ఇంఛార్జి వీసీగా కొంత కాలం పని చేసిన ఐఏఎస్ అధికారి దాన కిశోర్ యూనివర్సిటీ క్యాంపస్ సుందరీకరణకు శ్రీకారం చుట్టగా ప్రస్తుత వీసీ ప్రొ.కుమార్ స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించారు. దాన కిశోర్ జీహెచ్ఎంసీ నిధులతో ల్యాండ్‌స్కేప్ గార్డెన్, ఆర్ట్స్ కాలేజీ బ్యాంక్ వైపు పూల మొక్కలు నాటించి అందంగా తీర్చిదిద్దారు. వీసీ ప్రొ.కుమార్ క్యాంపస్‌లో ఎక్కడ చెత్త, చెదారం కనిపించకుండ శుభ్రం చేయిస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు, ఉద్యోగులకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించడంతో పాటు స్వయంగా భాగస్వాములను చేశారు. కాలేజీలు, కార్యాలయాలు, హాస్టల్స్ పరిసరాలతో పాటు గార్డెన్లు, రోడ్లు, ఇతర ప్రాంతాలలో చెత్త లేకుండ ఎరివేడంతో పాటు ప్లాస్టిక్ రహిత క్యాంపస్ లక్ష్యంగా సిబ్బందితో పని చేయిస్తున్నారు. సంక్రాతి పండుగ వరకు ఓయూ క్యాంపస్ సుందరంగా కనిపించనుంది.



క్యాంపస్ హాస్టల్స్ పరిసరాలలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సెంట్రల్ వర్సిటీ పెర్ ప్రాజెక్టులో ఓయూ

తొలిసారి సైన్స్ అండ్ సోషల్ సైన్స్ కలయికలతో పరిశోధనలు



ఓయూ ఆర్ట్స్ కాలేజీ

ఉస్మానియా యూనివర్సిటీ: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) చేపట్టిన ప్రివెంటింగ్ అండ్ అసిలేటరింగ్ రిసెర్చ్ ప్రోగ్రామ్ (పెర్) ప్రాజెక్టు ఓయూ ఎంపికైనట్లు యూజీసీ డీన్ ప్రొ.లావణ్య గురువారం తెలిపారు. ప్రాజెక్టు ఎంపిక కోసం గత డిసెంబరు 23న జరిగిన పవర్ పాయింట్ ప్రజెంటషన్‌లో ఓయూ ప్రొఫెసర్లు సత్తా చాటిన్నట్లు చెప్పారు. వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి, వోఎస్‌డీ ప్రొ.జితేందర్ నాయక్ చొరవతో ప్రతిష్టాత్మక పెర్ ప్రాజెక్టు దక్కిందన్నారు. వీసీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వత యూనివర్సిటీకి లభించిన తొలి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఓయూలో సైన్స్, సోషల్‌సైన్స్ కలయితో పరిశోధనలకు జరగాలనే వీసీ ప్రొ.కుమార్ సంకల్పం ఫలించిందన్నారు.

◆ హెచ్‌సీయూ పర్యవేక్షణలో ఐదు సంవత్సరాలు కొనసాగే ఈ ప్రాజెక్టులో దేశ వ్యాప్తంగా 10 స్పోక్‌లను (వర్సిటీలు, పరిశోధన సంస్థలు) ఎంపిక చేయగా అందులో ఓయూ ఎంపిక కావడం విశేషమన్నారు. కేంద్రం నుంచి పెరు ప్రాజెక్టుకు లభించు రూ.100 కోట్ల నిధుల నుంచి ఓయూకు లభించు వాటతో యూనివర్సిటీ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో త్వరలో పరిశోధనలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. పెర్ ప్రాజెక్టు కోసం ఓయూ కెమిస్ట్రీ విభాగం నుంచి సీనియర్ అధ్యాపకులు, మహిళ వర్సిటీ మాజీ ప్రొ.విజ్జులత, డా.మురళీధర్‌రెడ్డి, ప్రొ.విజయ్‌కుమార్, డా.కవిత, ప్రొ.హరిపద్మశ్రీతో పాటు ఆర్ట్స్ కాలేజీ సోషియాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ రామ్‌బీమనేని షఫర్డ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) అండ్ మిషన్ లర్నింగ్ ఇన్ హ్యూమన్ హెల్త్, ఎనిమల్ హెల్త్, ఎన్విరాన్‌మెంట్, మెడికల్ టెక్నాలజీలపై పరిశోధనలు చేయనున్నట్లు చెప్పారు.

గంగపుత్రుల అభ్యున్నతికి కృషి చేస్తా

ఫిషరీస్ ఛైర్మన్ సాయికుమార్

చిలకలగూడ: గంగపుత్రుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. వారాసిగూడ గంగపుత్ర సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నిరంగాల్లోని గంగపుత్రులు మరింతగా రాణించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘ అధ్యక్ష,కార్యదర్శులు రాజలింగం, మల్లేష్, కోశాధికారి గణేష్, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, సంఘ ప్రతినిధులు కంది నారాయణ, కొమురయ్య, గాలేష్, యాదగిరి, అశోక్, నవీన్, శ్రీకాంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



గంగపుత్రులతో కలిసి కేలండర్ ఆవిష్కరిస్తున్న ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్

జీడీఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రాంగోపాల్‌పేట్: టాటా స్ట్రైవ్, బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో జీడీఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 20 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు ఈ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ అందించి అనంతరం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్యారడైజ్‌లోని పాత సన్‌షైన్-కిమ్స్ ఆస్పత్రి తేజ బ్లాక్ నాల్గో అంతస్తులో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.82472 55859, 63000 61059.

రోడ్డు విస్తరణలో శ్మశానవాటికలను మినహాయించండి



ఎంపీ అసదుద్దీన్‌ను కలిసిన జేఏసీ నేతలు

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం కోసం చేపట్టే రోడ్డు విస్తరణలో ముస్లిం శ్మశానవాటికలను మినహాయించాలని ఈ మేరకు ఏర్పాటైన జేఏసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్యారడైజ్ సర్కిల్ నుంచి డెయిరీ ఫారం వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా తాడ్‌బండ్, బోయిన్పల్లిలోని ముస్లిం శ్మశానవాటికల భూములను సేకరించకుండా చూడాలని కోరుతూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి శ్మశానవాటిక పరిరక్షణ జేఏసీ సభ్యులు విన్నవించారు. తాడ్‌బండ్ శ్మశానవాటికలో 4,400 గజాలు, బోయినపల్లి శ్మశానవాటిక 3,900 గజాల స్థలం కారిడార్ నిర్మాణంలో కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీచ్చారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు ఫోన్ చేసి శ్మశానవాటిక పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సమస్యను ముఖ్యమంత్రి, రోడ్డు భవనాల శాఖ మంత్రి,భూసేకరణ అధికారులకు ఫిర్యాదులు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నయీమ్, అజామ్, షోయబ్, గౌస్, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ రైల్వే స్టేషన్ లోనిని ప్లాట్‌ఫాం నం.3లో ఈనెల 2న ఉదయం 10గంటల సమయంలో కర్ణాటకకు చెందిన రాజు పవార్(60) అనే వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన రైల్వే పోలీసులు అతని వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి పక్కనే పడి ఉన్న ఓ పేపర్‌లో ఉన్నటువంటి నంబర్‌కు ఫోన్ చేయగా మృతుడి కుమారుడు ఎత్తాడు. వారం రోజులుగా తండ్రి కోసం వెతుకుతున్నామని అతడు చెప్పాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని శ్రీనివాస భవన్ నుంచి సెవన్ టెంపుల్స్ వరకు రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రహదారులు ఎంతో అధ్వానంగా ఉండేవని తాము అధికారంలోకి వచ్చాక రహదారులను అభివృద్ధి చేశామన్నారు. రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించామని అన్నారు. అంతే కాకుండా డ్రైనేజీ, వాటర్‌లైన్, సీవరేజ్ కొత్త లైన్లను సైతం వేశామన్నారు. నాణ్యత లోపించకుండా రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ భాస్కర్, స్ట్రీట్‌లైట్ ఏఈ సుష్మ, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరీంలాలా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతోనే ఉన్నతి

పద్మారావునగర్: నిరంతర లక్ష్యసాధనతో పని చేసిన వారే జీవితంలో ఉన్నత స్థాయిలో రాణిస్తారని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్ అన్నారు. పద్మారావునగర్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఎదగాలనే పట్టుదల ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. దేవుడు ఓ పర్పస్‌తో మనిషికి భూమికి పంపారన్నారు. ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి కష్టపడి పని చేయాలని కోరారు. కష్టపడి చదువుకొని జీవితంలో పైకి వచ్చిన వారు ఎంతో మంది దేశంలో ఉన్నారని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని.. పట్టుదలతో ముందుకు సాగినప్పుడు జీవితంలో పైకి వస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు సామల వేణు, ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్ చైర్మన్ ఉమాకార్తీక్, సినీనటి శిల్పా, డాక్టర్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా రాధే రాధే గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో అనేక మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.



విద్యార్థులకు స్టడీమెటీరియల్స్‌ను అందజేస్తున్న ఆదాయ పన్ను కమిషనర్ జీవన్‌లాల్

నూతన సంవత్సర శుభాకాంక్షలు

సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ పరిధిలోని నాయకులు తమ తమ పార్టీల పెద్దలను కలసి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో కేలండర్లు, డైరీలను ఆవిష్కరింపజేశారు.

– సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ బృందం



రైల్వే ఇంజనీర్స్ అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రైల్వే జీఎం ఏకే జైన్



శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న త్రికాల మనోజ్‌కుమార్



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న త్రికాల మనోజ్‌కుమార్, సంతోష్‌కుమార్, సృజన్



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జంపన ప్రతాప్, సరిత





ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్ మహేశ్వరి

నార్త్‌జోన్‌లో మెట్రో విస్తరణ హర్షణీయం

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: హైదరాబాద్ నార్త్‌జోన్ ప్రజలకు నూతన సంవత్సర కానుకగా మెట్రో రైల్ కారిడార్‌ను నార్త్‌జోన్‌కు విస్తరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌కు, జేబీఎస్ నుంచి శామీర్‌పేటకు వరకు ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు మెట్రో రైలును విస్తరించడం వల్ల ఇక్కడి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల కృతజ్ఞతలు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు గురువారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారితో కలిసి సంబురాలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాడ్డాక కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా నార్త్‌జోన్ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ మెట్రో రైల్‌కు బీజం పడిందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే నార్త్‌జోన్ ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చడం కోసం ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుతో పాటు తాజాగా నార్త్‌జోన్ లో 45 కిలోమీటర్ల మెట్రో లైన్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం హర్షణీయమని అన్నారు.



పికెట్‌లో స్థానికులతో కలిసి సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్